# మహాయోధుడు

కొటూరు రవీంద్ర- త్రివిక్రమ్



ఇంటర్వెల్ అయింది.

జనం బిలబిలమంటూ బయటకొచ్చారు.

ఆ జనంలో జనార్దనం ఒకడు !

నలుగురితోపాటు థియేటర్ మూలకెళ్ళి చల్లనినీళ్లు ఓ గ్లాసెడు తాగి, సిగరెట్ కోసం 'కౌంటరు' దగ్గర నిలబడ్డాడు.

ఎదురుగా అద్దం కన్పిస్తోంది.

అందులోంచి తన ప్రతిబింబం అసలు రూపాన్ని పరిశీలించింది.

అప్పటికే అతని శరీరం – ఉత్సాహోద్రేకాలతో పొంగి ఉంది.

జీవకణాలు కొత్త శక్తితో చలిస్తున్నాయి.

కళ్ళు సరికొత్త కాంతితో మెరుస్తున్నాయ్.

బ్రూస్‌లీ !

నిజంగా మనిషా–మహాశక్తా ?!

అదంతా ట్రిక్ ఫొటోగ్రఫీ కాదు గద !

సిగిరెట్ అందుకుని వెలిగిస్తూ– అంతరంగంలో అలజడి చేస్తున్న ప్రశ్నలకి ఉక్కిరిబిక్కిరవసాగేడు. సిగిరెట్ రెండు దమ్ములు లాగి అటు యిటు పచార్లు చెయ్యసాగేడు. ఆవరణలో అతికించిన వాల్‌పోస్టర్లనీ, బ్రూస్‌లీ చిత్రాలతో ఉన్న బోర్డుల్నీ ఆపేక్షగా చూడనారంభించేడు.

తను కూడా 'కరాటే'లో ప్రావీణ్యం పొంది 'బ్రూస్‌లీ' కాగూడదా !

అబ్బ ... ఎంత వేగం ! ఏమి చాకచక్యం...!

ఎంత మనోనిశ్చలత ! ఏమి సాహసం !

మనసులోనే చేతులు జోడించాడు జనార్దనం.

సినిమా పునఃప్రారంభం కాబోతున్న సూచనగా 'బెల్' మోగింది.

జనం అదరాబాదరా లోపలికి పరుగెడుతున్నారు.

జనార్దనం కూడా సిగిరెట్ సాంతం తాగకుండానే దూరంగా పారేసి థియేటర్లోకి వెళ్ళాడు.

సినిమాలో అతను పూర్తిగా నిమగ్నమై పోయాడు.

'స్టంట్ సీన్' వచ్చినప్పుడల్లా ఉద్రేకంతో ఊగిపోతున్నాడు.

అప్రయత్నంగా గుప్పిళ్లు బిగుసుకుంటున్నాయ్.

విద్యుత్‌లాంటి చైతన్యం ఏదో శరీరంలో ప్రవేశించి తాండవమాడుతున్నట్లు ఫీలయ్యాడు.

సినిమా పూర్తయ్యేవరకు అతనీ పరిస్థితిలోనే మునిగి తేలాడు.

థియేటర్‌లోంచి బయటికొచ్చాక బ్రూస్‌లీ శక్తులన్నీ అతనిలోకి పరకాయ ప్రవేశం చేసినట్లనుభూతి చెందసాగేడు.

రోడ్డుమీద ఛాతీ విరుచుకుని నడవటం ప్రారంభించేడు.

కండలు పొంగి గట్టిపడినట్లనిపిస్తోంది !

అరచేతులు కత్తుల్లాగ పెట్టి అడుగులు వేస్తున్నాడు జనార్దనం.

నడుస్తూనే ఉన్నాడు. ఇప్పు డెవరొచ్చినా చిత్తుగా తన్నెయ్యగలడు !

ట్రాఫిక్‌లోంచి, హోటళ్లు, దుకాణాల పక్కనుంచీ ఇంటివైపు వేగంగా

నడుస్తున్నాడు.

నడుస్తూనే టైము చూసుకున్నాడు.

తొమ్మిదింబావు కాబోతోంది.

వేగం మరికాస్త పెంచాడు.

ఇంటిదగ్గర అర్ధాంగి ఆలస్యానికి ఆగ్రహించగల 'ప్రివిలెజ్'తో ఎదురు చూస్తుంటుంది.

'ఐ లీస్ట్ కేర్,' అనుకున్నాడు.

ఆలస్యం కాకుండా టైముకి ఇంటి దగ్గ రుండటానికి తనేమైనా బడి పిల్లాడా ?

తనిష్టం,

ఎక్కడెక్కడో తిరుగుతాడు. అలా తిరుగుతున్నందుకు చెవి 'కీ'లు, తొడపాశాలు ఆర్జించుకునే రోజులు దాటిపొయ్యాయి.

ఇప్పుడు తను బాధ్యతగల తండ్రి !

ఒకరి చేత చెప్పించుకోవాల్సిన అవసరం లేనేలేదు.

"మాస్టారూ ! టైమెంతయింది ?" ఎవరో బాటసారి ప్రశ్న.

జనార్ధనం ఆలోచనలు తెగిపోయాయి.

"తొమ్మిదిన్నర" అని జవాబిచ్చి మళ్ళీ తన ఆలోచనల్లోకి మళ్ళాడు.

అతని మనసులోకి పదే పదే సినిమాలో దృశ్యాలే ప్రవేశిస్తున్నాయి.

మళ్ళీ సినిమా చూస్తున్న అనుభూతికి లోనయ్యాడు.

అతను ఆ అనుభూతిలోని ఆనందం అనుభవిస్తుండగానే ఇల్లు వచ్చేసింది.

"రాజ్యం ... రాజ్యం..." తలుపు కొట్టాడు.

"వచ్చే..." అడుగులుదగ్గరవుతున్న శబ్దం.

తలుపులు తెరుచుకున్నాయి.

దారి కడ్డం తొలిగి జనార్ధనం లోపలికి రాగానే తలుపు వేసింది. జనార్ధనం నేరుగా ఇంట్లోకి వెళ్ళాడు. భార్యనుండి ప్రశ్న లేమీ విననందుకు ఆనందించాడు.

పిల్లలు మధ్య గదిలో ఆదమరిచి నిద్రపోతున్నారు

కాళ్ళు, చేతులు కడుక్కుని బట్టలు మార్చుకొచ్చాడు, జనార్ధనం.

భార్య భోజనానికి పిలుస్తుందేమోనని నిరీక్షించాడు. ఆ సూచనలేం లేవు !

ఎదురుగా తేదీల క్యాలెండరు ముప్పై ఒకటి చూపిస్తోంది.

'రేపు జీతాలు కాబోలు,' అనుకున్నాడు.

అంతలో రాజ్యం చిన్న గిన్నెలో 'స్పూన్' వేసి తీసుకొచ్చింది.

"ఏమిటిది ? పరమాన్నమా ?"

"కాదు—మజ్జిగన్నం !"

అతను నివ్వెరపోయేడు.

"అదేమిటి ?" అనాడు అటుపైన మాటలు రాక.




"ఈ రోజు మధ్యాహ్నం వరకే వెచ్చాలు సరిపోయ్యాయి. రాత్రి కేమీ లేకపోతే మధ్యాహ్నం మిగిలిన దాంట్లోనే పిల్లలకి సర్దిపెట్టాను. ఈ మజ్జిగలో కొద్దిగా అన్నంవేసి మీకోసం ఉంచాను..."

జనార్దనంలో అంతవరకు కాపురం చేసిన మహాయోధుడు "బ్రూస్‌లీ" పలాయన మంత్రం పఠించాడు !

అతని శరీరంలోని పొంగులన్నీ చల్లారి మామూలు మనిషయ్యాడు.

రాజ్యంకేసి చూస్తున్నాడు.

ఆమె మొహంలో తనపట్లగల అనురాగాన్ని కొలుస్తూ తన్మయత్వం చెందుతున్నాడు.

"రాజ్యం ! మధ్యాహ్నంనుంచీ నువ్వేమీ తిన్లేదు కదూ? నిజం చెప్పు..."

"ఇప్పుడా ప్రశ్నలన్నీ ఎందుకండీ... పొద్దుపోయింది. యీ మజ్జిగరసం పుచ్చు ఆని పడుకోండి. మళ్ళీ తెల్లవారితే కుఫీసు హడావిడీ."

నవ్వేడు జనార్దనం.

"రాజ్యం ! ఎంతటి మహాయోధుడైనా దారిద్ర్యం ముందు దాసోహ మనాల్సిందేనని యిప్పుడే తెల్సుకున్నాను. దాన్ని మించిన నిజం మరోటి ఏమిటో తెలుసా ? సృష్టిలో ప్రేమని మించిన శక్తిలేదు ... రా ... యిద్దరం కలిసే ఈ మజ్జిగన్నం తిందాం... బలవంతాన సమీపానికి జేర్చుకున్నాడు భార్యని.